నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు, పారిశుధ్యం, దోమల బెడద, వీధిదీపాలు, ఇతర ఏ సమస్యలు ఉన్నా జడ్సీ, డీసీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వారు తెలిపారు. ఆయా కార్యాలయాల్లో జరిగే ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటారని వారు చెప్పారు.



యూజీడీ సమస్యను జలమండలి మేనేజర్‌కు వివరిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

భూగర్భ డ్రైనేజీకి సత్వర పరిష్కారం

● కార్పొరేటర్ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): భూగర్భ డ్రైనేజీ సమస్యకు సత్వరమే పరిష్కారం చూపుతామని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ప్రజలకు హామీనిచ్చారు. స్థానిక అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఆదివారం శ్రీలాపార్క్‌ప్రైడ్‌లో డ్రైనేజీ సమస్యను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. యూజీడీ సమస్యను వెంటనే పరిష్కరించాలని జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డికి కార్పొరేటర్ సూచించారు. కాలనీలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన ప్రజలకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అల్లూరి మురళి, వినయ్, మనోజ్, మహేందర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న సత్యం శ్రీరంగం

రక్తదానం ప్రాణదానంతో సమానం

● టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యంశ్రీరంగం

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యంశ్రీరంగం అన్నారు. బాలాజీ నగర్ డివిజన్ వివేక్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హోలిస్టిక్, క్లవ్ డెంటల్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని, తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అనంతరం రక్తదాతలను ఆయన అభినందించారు.



మహేందర్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న బాలుయాదవ్

కూకట్‌పల్లి కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి

కూకట్‌పల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కూకట్‌పల్లి పార్ట్-1 కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ డివిజన్ అధ్యక్షుడు బాలుయాదవ్ ఆదివారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. అనంతరం బాలుయాదవ్ మాట్లాడుతూ, బీజేపీ బలోపేతానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మహిళలు, యువత, స్వయంశక్తితో ఎదిగేలా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అస్‌బెస్టాస్‌కాలనీ అధ్యక్షుడు నరేశ్, బీజేపీ నాయకులు రాజిరెడ్డి, భూపాల్‌రెడ్డి, పవన్‌యాదవ్, శ్రీకాంత్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

క్యాత్ ల్యాబ్‌లో రేడియేషన్ ఎక్కువ

● నిమ్స్‌లో కాంప్లికేషన్స్‌పై అవగాహన సదస్సు

నిమ్స్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): క్యాత్ లాబ్‌లో రేడియేషన్ ఎక్కువగా ఉంటుందని, దాని వల్ల వైద్యులకే ఎక్కువ సమస్యలు వస్తాయని కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ సోమరాజు అన్నారు. దానిని అధిగమించడానికి తగిన పరికరాలు వాడాలని వైద్యులకు సూచించారు. నిమ్స్ ఆస్పత్రి ఐదో అంతస్తు ట్రామా ఆడిటోరియంలో 'ఇంటర్వెన్షనల్ కాంప్లికేషన్స్' మేనేజ్‌మెంట్ ఆఫ్ క్యాత్ లాబ్ కాంప్లికేషన్స్' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ సోమరాజు, డా.దయాసాగర్‌రావు, డా.శేషగిరిరావు మాట్లాడారు. వైద్యులు ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కరోనరి యాంజియోగ్రఫీ, పీటీసీఏ(గుండెకు)స్టంట్‌ను సరైన పద్ధతిలో ఎలా అమర్చాలి అనే అంశాలపై చర్చించారు. డాక్టర్ రమాకుమారి ఆధ్వర్యంలో జరిగిన కంటున్యూ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎంఈ) ప్రోగ్రాంలో డా.శ్రీనివాస్‌కుమార్, డాక్టర్ అనుజ్ కపాడియా, డాక్టర్ శశికాంత్, డాక్టర్ అమర్నాథ్ పాల్గొన్నారు.



తనికెళ్ల భరణి, బ్నింలను సత్కరిస్తున్న అతిథులు

తనికెళ్ల భరణి, బ్నింకు 'బాపు రమణ'ల స్నేహ పురస్కారం

రవీంద్రభారతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బాపు, రమణల స్నేహం ఈ తరానికి ఆదర్శప్రాయమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో బాపు రమణ లోగిలి సంస్థ ఆధ్వర్యంలో ముళ్లపూడి వెంకటరమణ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి, రచయిత బ్నింలకు బాపురమణల స్నేహ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మామిడి హరికృష్ణ పురస్కారాల గ్రహీతలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్నేహానికి మారుపేరుగా నిలిచే బాపు, రమణల పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనికెళ్ల భరణి చిరస్థాయి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. తన రచనలతో బ్నిం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిత్ మోహన్, వింజమూరి వెంకట అప్పారావు, భావరాజు పద్మిని, వేగిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొని పురస్కార గ్రహీతల్ని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను ఆవిష్కరించారు.

కేపీ హెచ్‌బీలో రాజీవ్ రోటరీ కుదింపు..!

● ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు

● బారికేడ్లు తొలగిస్తే వాహనదారులకు ప్రయోజనమే



కేపీహెచ్‌బీలో ఉన్న రాజీవ్‌గాంధీ రోటరీ



రాజీవ్ రోటరీ ఎదుట పార్కు చేసిన వాహనాలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు తాజాగా 'రాజీవ్ రోటరీ' మార్గాన్ని పునఃసర్దుబాటు చేయడంపై దృష్టి సారించారు. గత పదేళ్ల కాలంలో రోటరీ వాస్తవ రూపంలో మూడు, నాలుగు సార్లు మార్పు చేశారు. అయినా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదు. పెరిగిన వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరోసారి రాజీవ్ రోటరీని కుదించేందుకు అధికారులు సిద్ధమైనట్టు సమాచారం. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో రాజీవ్‌రోటరీ విషయంలో అధికారులు ఆచితూచి అడుగులు వేయాలని యోచిస్తున్నట్టు వినికిడి. రాజీవ్ రోటరీని కుదించినా.. దాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దితే ఎలాంటి ఇబ్బంది ఉండని అధికారులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. రాజీవ్ రోటరీని కుదించడంతో పాటు రోడ్డుపై ఉన్న బారికేడ్లను తొలగిస్తే వాహనదారులకు ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్..

రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుతో కేపీహెచ్‌బీలో ఉన్న ప్రధాన కూడళ్లలో ఇదొకటిగా నిలిచింది. కేపీహెచ్‌బీ తొమ్మిది, గోకుల్ ప్లాట్స్, ఆరోఫేజ్, జేఎన్‌టీయూ, రోడ్డు నంబర్-1, ఐదోఫేజ్ డీమార్ట్‌కు వెళ్లే ప్రధాన రోడ్లకు మధ్యన దేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారు. రాజీవ్ రోటరీ ఎక్కువగా ఉండడంతో వాహనాలు రాకపోకలు సాగించడం కష్టంగా మారింది. దీంతో రోటరీకి రెండు వైపులా వాహనాల కోసం వదిలేసిన ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను మూసివేశారు. తాజాగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే క్రమంలో రాజీవ్ రోటరీని కుదిస్తే ఎలా ఉంటుందని అధికారులు ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది.

నివేదిక సిద్ధం..!

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో రాజీవ్ రోటరి విషయంలో అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రోటరీ కుదించినా ప్రస్తుతం ఉన్న దానికంటే మరింత సుందరంగా అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్ అధికారులు రాజీవ్ రోటరీ పనుల గురించి నివేదిక తయారు చేసినట్లు తెలిసింది. ఇది అమల్లోకి వస్తే వాహనదారులకు ప్రయోజనం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సెలవు దినాల్లో మరీ అధ్వానం..

రాజీవ్ రోటరీ ప్రాంతంలో మూడు చోట్లకుగాను ఒకచోట మాత్రమే రెగ్యులర్‌గా వాహనాల రాకపోకలకు అనుమతిస్తుంటారు. ఒక్కోసారి దాన్ని కూడా మూసివేస్తారు. దీంతో వాహనదారులు కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్ ఆర్వోబీ కి వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. దీనివల్ల ఒక్క వాహనం అదనంగా 3కిలోమీటర్లు తిరిగి రావాల్సి ఉంటుంది. ఇక హైటెక్‌సిటీవైపు నుంచి కేపీహెచ్‌బీకి వచ్చేవారి పరిస్థితి కూడా అంతే. జేఎన్‌టీయూ రోడ్డులోని రైతుబజార్ దాటిన తర్వాత యూటర్న్ తీసుకోవాల్సి వస్తుంది. అంటే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాహనదారుల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని రోటరీని కాస్త కుదిస్తే ప్రస్తుతం మూసేసి ఉన్న రెండు చోట్ల నుంచి వాహనాలు యూటర్న్ తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల విజ్ఞప్తి మేరకు

రాజీవ్ రోటరీ కుదింపు గురించి ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. అక్కడ ట్రాఫిక్ జామ్ సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. దీంతో రూ.11లక్షల వ్యయంతో పనులు చేపట్టబోతున్నాం. దీని తర్వాత రోటరీ వద్ద వాహనాలు నిలిచిపోకుండా ఉంటాయని భావిస్తున్నాం. ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్‌తో సమన్వయంతో పనులు చేయడం వల్ల సమస్యకు పరిష్కారం లభించనుంది.

- రమేశ్, ఏఈ, జీహెచ్‌ఎంసీ మూసాపేట్ సర్కిల్

తెలంగాణ నాయర్ సొసైటీ ఏర్పాటు అభినందనీయం

● గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై

కాప్రా, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా, నిస్వార్థ సేవే లక్ష్యంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని గోవా గవర్నర్ పీఎస్. శ్రీధరన్ పిళ్లై అన్నారు. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఆదివారం కాప్రాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణలోని నాయర్లు సేవా సొసైటీని ఏర్పాటు చేసుకుని ఏకతాటిపైకి రావడం శుభ పరిణామమని కొనియాడారు. కేరళ నాయర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మన్నత్ పద్మనాభన్ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీ పనిచేయాలని, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా తెలంగాణలోని అన్ని వర్గాల వారికి సేవలందించాలని ఆయన సూచించారు. అనంతరం వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయర్ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాయర్ సేవా సొసైటీ అధ్యక్షుడు సురేంద్రన్, ఉపాధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



వడియరాజులు సొసైటీ కార్యవర్గంతో ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వడియరాజులు సొసైటీ సంఘం అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సభ్యులకు సూచించారు. కొండాపూర్ మార్తాండ్‌నగర్ కాలనీకి చెందిన వడియరాజులు సొసైటీ సంఘానికి నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వివేకానందనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సంఘం సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ, సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, వడియరాజులు సొసైటీ సంఘం అధ్యక్షుడు దుర్గారావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెక్రటరీ కొండల్‌రావు, జాయింట్ సెక్రటరీ మధు, ట్రెజరర్ శ్రీనివాసులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి ఫ్లైఓవర్‌కు పీజేఆర్ పేరు పెట్టడం హర్షణీయం

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్



టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్‌ను సన్మానిస్తున్న పాస్టర్ పాల్

కూకట్‌పల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి చౌరస్తాలో నిర్మించిన ఫ్లైఓవర్‌కు కాంగ్రెస్ మాజీ మంత్రి పి.జనార్దన్‌రెడ్డి పేరు పెట్టడం సంతోషంగా ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ అన్నారు. బాలానగర్ రాజు కాలనీ వద్ద ఉన్న పీజేఆర్ విగ్రహానికి, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేశ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. ఇటీవల టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన బండి రమేశ్‌ను అంబికానగర్ చర్చి పాస్టర్ పాల్, చర్చి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, శ్రీకాంత్‌పటేల్, ఏఎంసీ చైర్మన్ పుష్పారెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మధుగౌడ్, నాయకులు కృష్ణరాజ్‌పుత్, గొట్టిముక్కల దేశాల్ సంజీవరావు, కాంగ్రెస్ మహిళా నాయకులు, పీజేఆర్ అభిమానులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ కల్యాణానికి రమేశ్ హాజరు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ ఏడోఫేజ్ ఆర్‌యూబీ వద్ద ఉన్న కైత్లాపూర్ రేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు సంతోష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొబైల్‌కు దూరంగా ఉంటే లక్ష్యాలను చేరుకోవచ్చు



మాట్లాడుతున్న ఆవోప రాష్ట్ర అధ్యక్షుడు శంకర్

హైదర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అవసరానికి తగ్గట్లు మొబైల్ వాడాలని, మొబైల్స్ వాడకం తగ్గిస్తే విద్యార్థులు తమ లక్ష్యాలను సాధిస్తారని ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోప) రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ సూచించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ 2024-25గాను మేడ్చల్ జిల్లాకు చెందిన ఆర్యవైశ్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 150మంది విద్యార్థులకు మేడ్చల్ జిల్లా ఆవోపా కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఆదివారం కూకట్‌పల్లి పీఎంఎం పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, కోశాధికారి సతీష్ చేతుల మీదుగా విద్యార్థులకు పురస్కారాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులను గౌరవించడం విద్యార్థులు నేర్చుకోవాల్సిన ముఖ్యమైన విషయమన్నారు. నిత్యం విద్యార్థులు ఉదయం 5గంటలకు బ్రహ్మ ముహూర్తంలో లేవడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థుల అలవాట్లను తల్లిదండ్రులు గమనించలన్నారు. తప్పుదారిలో వెళ్తున్నారని అనుమానం వస్తే సన్మార్గంలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆవోప రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వందనపు శిల్ప, ఆర్యవైశ్య సంఘం జిల్లా సభ్యులు రవికుమార్, ప్రకాష్‌గుప్త, ప్రవీణ్‌కుమార్‌గుప్త, రమేష్‌కుమార్‌గుప్త, రఘువంశీ, నవీన్, వినయ్ పాల్గొన్నారు.

చరిత్రకు, సాహిత్యానికి సరిహద్దులు చెరిపేసిన కొప్పర్తి సంభాషణ

● పలువురు వక్తలు



కొప్పర్తి వ్యాసాల సంపుటి, సంభాషణను ఆవిష్కరిస్తున్న ప్రముఖ చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చరిత్ర, కవిత్వం వేర్వేరు అని ఆరిస్టాటిల్ అనే వారని, కానీ చరిత్రకు, సాహిత్యానికి సరిహద్దులు చెరిపేసిన కొప్పర్తి సంభాషణ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కొప్పర్తి రచించిన చరిత్ర, సామాజిక వ్యాసాల సంపుటి సంభాషణ పుస్తకాన్ని ప్రముఖ చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిస్టరీ కాంగ్రెస్‌కు ఈ సంభాషణ ఒక దిక్సూచిగా నిలిచిందన్నారు. ఆసక్తికరమైన అంశాలను రచయిత సంభాషణలు పొందుపరిచారని, ఈ పుస్తకం చదివితే కొప్పర్తి రచనా నైపుణ్యం తెలుస్తోందన్నారు. కొత్త విజ్ఞానపరమైన అంశాలు దీనిలో ఉన్నాయన్నారు. కొప్పర్తి మూడు కవిత్వ సంపుటల సంకలనం కవిత్వం పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరించి మాట్లాడారు. కవిత్వం మూర్తీభవించిన సజీవ ప్రాణిగా నిలిచిందన్నారు. చరిత్రకు సాహిత్యానికి ఉన్న చరిత్రను చెరిపివేసిందని, దీనిపై చర్చ జరగాలన్నారు. బీజేయూ జాతీయ కార్యదర్శి దూషణపూడి సోమసుందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో కొప్పర్తి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు మద్దతు తెలిపారని అన్నారు. ఆయన నేతాజీపై రాసిన వ్యాసం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైందని గుర్తు చేశారు. ఏపీకి స్వతంత్ర అస్తిత్వం లేదని, అక్కడి ప్రజలు దీని గురించి ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. చరిత్రకు మతం ఉండదని రచయిత చాటి చెప్పారని అన్నారు. కొప్పర్తి పుస్తకాలు నేటి యువతకు మార్గదర్శనం అన్నారు. ఈ ఆవిష్కరణ సభకు ప్రముఖ కవి, విమర్శకులు వాడ్రేవు చినవీరభద్రుడు అధ్యక్షత వహించగా ప్రముఖ కవి, విమర్శకులు దర్భశయనం శ్రీనివాసాచార్య, యువకవి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో గాయత్రినగర్

● రాత్రివేళల్లో వెలగని వీధి దీపాలు



గాయత్రినగర్‌లో చీకటి అలముకున్న ఓ వీధి

అల్లాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రినగర్ రాత్రివేళ చీకటి లోకంగా మారింది. కాలనీల్లో ఉన్న వీధి దీపాలు చాలా వరకు పనిచేయడంతో అంధకారం అలుముకుంటోంది. సాయంత్రం ఏడు దాటిన తర్వాత బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. ముఖ్యంగా వీధుల్లో వెలుగులేమి కారణంగా మహిళలు, వృద్ధులు భయపడుతున్నారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు చొరవ తీసుకుని జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 25, వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 23, కాకరకాయ 38, బీరకాయ 32, క్యాబేజీ 18, బీన్స్ 85, క్యారెట్ 37, గోబిపువ్వు 30, దొండకాయ 35, చిక్కుడుకాయ 55, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 28, క్యాప్సికం 60, ఆలుగడ్డ 26, కీర 28, దోసకాయ 18, సొరకాయ 15, పొట్లకాయ 18, కంద 55, ఉల్లిపొరక 45, ఉల్లిగడ్డ 24, అరటికాయ 10-11, చామగడ్డ 28, ముల్లంగి 4-5, చిలగడదుంప 30, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 24-30, మునగకాయలు 6-8, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 75, కరివేపాకు 60, పర్వల్ రూ.60, పల్లికాయ 60, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు సోమవారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



మోదీ మాస్కులతో బీజేపీ నాయకులు

కేంద్ర పథకాలపై అవగాహన

హైదర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ వంశీరెడ్డి ఆధ్వర్యంలో మోదీ 11ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాని మోదీ పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ముఖాలకు మోదీ మాస్కులు ధరించి నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సురేశ్ (ఫైల్)

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో ముంబయి జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. బోడుప్పల్ రాజీవ్‌నగర్‌కు చెందిన పాడియ సురేష్(24) ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు షాపింగ్ కోసం కూకట్‌పల్లిలో ఉన్న స్నేహితుల వద్దకు వచ్చాడు. రాత్రి 10 దాటడంతో రాత్రి అక్కడే పడుకొని ఉదయం వస్తానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇంటికి వస్తున్నానని ఫోన్‌లో చెప్పాడు. 5 గంటల సమయంలో మెట్రో పిల్లర్ 839వద్ద వాహనం ఢీకొని ఓ వ్యక్తి చనిపోయినట్లు కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందింది. అప్పటికే అక్కడకు చేరుకున్న 108 అంబులెన్స్ వచ్చి పరీక్షించి అతను చనిపోయినట్లు నిర్ధారించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతి చెందిన వ్యక్తిని సురేశ్‌గా గుర్తించారు. అనంతరం అతని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అతను బైకుపై కూకట్‌పల్లి నుంచి బాలానగర్ వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందని పోలీసులు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తీసుకెళ్లారు. మృతుడి తండ్రి తిరుపతయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సాయికిరణ్ (ఫైల్)

హైదర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి లాడ్జిలో మృతిచెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై ప్రభాకర్, మృతుడి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు పరిధిలోని వెలమల గ్రామానికి చెందిన కె.సాయికిరణ్(32) ఈ నెల 26న జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో ఒక రోజుకు గదిని అద్దెకు తీసుకున్నాడు. మరుసటిరోజు రాత్రి వరకు ఖాళీ చేయక పోవడంతో సిబ్బంది గదికి వెళ్లి చూడగా మంచంపై కదలేని స్థితిలో ఉన్న యువకుడిపై సందేహం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సాయికిరణ్‌ను పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతికి గల కారణాలు తెలియరాలేదని, గదిలో మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. తనకు నగరంలో పని ఉందని, ద్విచక్రవానం బాగు చేయించాలని ఇంట్లో చెప్పి వచ్చినట్లు మృతుడు తండ్రి తెలిపాడు. సాయికిరణ్‌కు భార్య, రెండేళ్ల పాప ఉన్నారు.

ఘనంగా వారాహి నవరాత్రి వేడుకలు

చందానగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): చందానగర్ పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా వారాహి నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు.

నేడు ప్రజావాణి

చందానగర్, జూన్ (29)(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉపకమిషనర్ పి.మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందాలని ఆయన సూచించారు.

జలమండలి కార్యాలయంలో..

హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని హఫీజ్‌పేట్ డివిజన్ జలమండలి జీఎం సత్యనారాయణ తెలిపారు. వాటర్ సరఫరాలో ఇబ్బందులు, మురుగు నీటి సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

శేరిలింగంపల్లి జోన్ పరిధిలో..

గచ్చిబౌలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోన్ పరిధిలో నేడు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని జోనల్ కమిషనర్ హేమంత్ ఓ ప్రకటనలో తెలిపారు. శేరిలింగంపల్లి, చందానగర్, పటాన్‌చెరువు, రామచంద్రాపురం, యూసుఫ్‌గూడ, సర్కిళ్లలో అన్ని శాఖల అధికారులు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని వివరించారు. ఆయా సర్కిళ్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకునే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా వారాహి నవరాత్రి వేడుకలు

చందానగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): చందానగర్ వీజేఆర్ ఎన్‌క్లేవ్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా వారాహి నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


పుష్పాలంకరణలో వారాహి అమ్మవారు


కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ వంశీరెడ్డి తదితరులు

కేంద్ర పథకాలపై అవగాహన

హైదర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ వంశీరెడ్డి ఆధ్వర్యంలో మోదీ 11ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆదివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధాని మోదీ పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ముఖాలకు మోదీ మాస్కులు ధరించి నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

హైదర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి లాడ్జిలో మృతిచెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్సై ప్రభాకర్, మృతుడి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు పరిధిలోని వెలమల గ్రామానికి చెందిన కె.సాయికిరణ్(32) ఈ నెల 26న జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో ఒక రోజుకు గదిని అద్దెకు తీసుకున్నాడు. మరుసటిరోజు రాత్రి వరకు ఖాళీ చేయక పోవడంతో సిబ్బంది గదికి వెళ్లి చూడగా మంచంపై కదలేని స్థితిలో ఉన్న యువకుడిపై సందేహం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సాయికిరణ్‌ను పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతికి గల కారణాలు తెలియరాలేదని, గదిలో మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. తనకు నగరంలో పని ఉందని, ద్విచక్రవాహనం బాగు చేయించాలని ఇంట్లో చెప్పి వచ్చినట్లు మృతుడు తండ్రి తెలిపాడు. సాయికిరణ్‌కు భార్య, రెండేళ్ల పాప ఉన్నారు.


సాయికిరణ్ (ఫైల్)

భవనం పైనుంచి దూకి మహిళ ఆత్మహత్య

చందానగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నాలుగు అంతస్తుల భవనంపై నుంచి దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన కుమారి(33) శేరిలింగంపల్లి నియోజకవర్గం పాపిరెడ్డినగర్ అరంభ టౌన్‌షిప్‌లో భర్త ప్రసాద్‌రావు, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటుంది. గత కొన్ని సంవత్సరాల నుంచి ఆమె మానసిక పరిస్థితి సరిగాలేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి నాలుగు అంతస్తుల భవనంపై నుంచి దూకింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.


కొప్పర్తి వ్యాసాల సంపుటి, సంభాషణను ఆవిష్కరిస్తున్న వకుళాభరణం రామకృష్ణ

చరిత్రకు, సాహిత్యానికి సరిహద్దులు చెరిపేసిన కొప్పర్తి సంభాషణ

- పలువురు వక్తలు

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చరిత్ర, కవిత్వం వేర్వేరు అని అరిస్టాటిల్ అనే వారని, కానీ చరిత్రకు, సాహిత్యానికి సరిహద్దులు చేరిపేసిన కొప్పర్తి సంభాషణ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కొప్పర్తి రచించిన చరిత్ర, సామాజిక వ్యాసాల సంపుటి సంభాషణ పుస్తకాన్ని ప్రముఖ చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిస్టరీ కాంగ్రెస్‌కు ఈ సంభాషణ ఒక దిక్సూచిగా నిలిచిందన్నారు. ఆసక్తికరమైన అంశాలను రచయిత సంభాషణలు పొందుపరిచారని, ఈ పుస్తకం చదివితే కొప్పర్తి రచనా నైపుణ్యం తెలుస్తోందన్నారు. కొత్త విజ్ఞానపరమైన అంశాలు దీనిలో ఉన్నాయన్నారు. కొప్పర్తి మూడు కవిత్వ సంపుటల సంకలనం కవిత్వం పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరించి మాట్లాడారు. కవిత్వం మూర్తీభవించిన సజీవప్రాణిగా నిలిచిందన్నారు. చరిత్రకు సాహిత్యానికి ఉన్న చరిత్రను చెరిపివేసిందని, దీనిపై చర్చ జరగాలన్నారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి దూషణపూడి సోమసుందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో కొప్పర్తి తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు మద్దతు తెలిపారని అన్నారు. ఆయన నేతాజీపై రాసిన వ్యాసం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైందని గుర్తు చేశారు. ఏపీకీ స్వతంత్ర అస్తిత్వం లేదని, అక్కడి ప్రజలు దీని గురించి ఎందుకు ఆలోచించడం లేదని ప్రశ్నించారు. చరిత్రకు మతం ఉండదని రచయిత చాటి చెప్పారని అన్నారు. కొప్పర్తిపుస్తకాలు నేటి యువతకు మార్గదర్శనం అన్నారు. ఈ ఆవిష్కరణ సభకు ప్రముఖ కవి, విమర్శకులు వాడ్రేవు చినవీరభద్రుడు అధ్యక్షత వహించగా ప్రముఖ కవి, విమర్శకులు దర్భశయనం శ్రీనివాసాచార్య, యువకవి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య సెల్ టవర్లు

- ఎంఐజీకాలనీ ఫేజ్1 సీ పార్కులో టవర్ నిర్మాణంపై స్థానికుల్లో ఆందోళన
- వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున వెలుస్తున్న పోస్టర్లు
- ప్రజల ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు

భెల్‌కాలనీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నిత్యం క్రీడాకారులు, చిన్నారులు, వాకర్స్, వయోవృద్ధులతో సందడిగా ఉండే పచ్చని పార్కు ఆవరణలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. జనావాసాల నడుమ ఏర్పాటు చేస్తున్న టవర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున పోస్టర్లు వెలిశాయి. మరో పక్క టవర్‌ను తొలగించాలని కోరుతూ స్థానికులు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, డివిజన్ ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. డివిజన్ ప్రజాప్రతినిధుల సహకారం తోనే టవర్ ఏర్పాటు చేశారంటూ స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీకాలనీ ఫేజ్1 సీ పార్కు ఆవరణలో సెల్‌టవర్ ఏర్పాటుకు కాలనీ సొసైటీ అనుమతించింది. నామమాత్రపు అద్దెతో పదేళ్లపాటు టవర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించడంతో జనావాసాల మధ్య ఆఘమేఘాలపై టవర్ ఏర్పాటును పూర్తిచేశారు. కాగా పార్కు ఆవరణలో ఇళ్ల నడుమ టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

పెద్ద ఎత్తున పోస్టర్లు..

సీ పార్కులో పరిస్థితి ఇలా ఉంటే బీపార్కు ఆవరణలోనూ సెల్‌టవర్ ఏర్పాటు చేస్తున్నారనే వార్తల నేపథ్యంలో వీటికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోస్టర్లు వెలిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల మధ్య ఎలాంటి అనుమతులు పొందకుండా ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్లతో విడుదలయ్యే రేడియేషన్ కారణంగా చర్మవ్యాధులు, కళ్ల మంటలు, మోకాళ్ల, చేతుల నొప్పులు, ఎముకలకు సంబంధించిన రోగాల బారిన పడే ప్రమాదముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కుకు వచ్చే వారిపై ప్రభావం చూపుతుందని వాపోతున్నారు. నివాసాల నడుమ టవర్ ఏర్పాటుకు సొసైటీ మేనేజింగ్ కమిటీ అనుమతులు ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లొదిలి..

టవర్ల ఏర్పాటుకు ప్రత్యేక నిబంధనలు ఉండటంతో పాటు ఏర్పాటు సమాచారాన్ని జీహెచ్ఎంసీ విద్యుత్ శాఖకు వివరించి ఎన్ఓసీ తీసుకోవాల్సి ఉంది. అయితే అనుమతి తీసుకోకుండా టవర్‌ల యాజమాన్యాలతో సొసైటీ ఒప్పందం కుదుర్చుకుని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం కోల్పోవడమే కాకుండా, ఆయా ప్రాంతాల్లో గల విద్యుత్ ఫీడర్లపై అధిక లోడు పడుతోంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం టవర్ల ఏర్పాటు విషయంలో చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. సెల్‌టవర్ల వల్ల రేడియేషన్ పెరిగి పక్షుల్లో సంతానోత్పత్తి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు చెబుతున్నారు.



సొసైటీ నిర్ణయంతో ఇబ్బందులు

నివాసాల మధ్య టవర్లను ఏర్పాటు చేయడం వల్ల చిన్నపిల్లలు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలకు హాని కలిగించే విధంగా ఏర్పాటు చేయకూడదని ఆదేశాలు ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. మా ఇంటి ముందు టవర్ ఏర్పాటు చేస్తున్నట్లు కనీసం సమాచారం ఇవ్వలేదు. స్థానిక నాయకుల సహకారంతో సొసైటీ మేనేజింగ్ కమిటీ నిర్ణయం తీసుకుని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. అధికారులు స్పందించి ఇళ్ల మధ్య ఉన్న సెల్‌టవర్లను తొలగించాలి. **- శ్రీనివాస్, స్థానికుడు**

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

ముందస్తు అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్న టవర్‌ను ఇక్కడి నుంచి తొలగించాలి. దీనిపై ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. టవర్ ఏర్పాటుపై జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాం. అక్రమాలకు పాల్పడిన సొసైటీ డైరెక్టర్లపై చర్యలు తీసుకోవడంతో టవర్‌ను తొలగించే వరకు పోరాటం చేస్తాం. **- జాషువా, స్థానికుడు**


పార్కు ఆవరణలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్, సి పార్కును కాపాడాలంటూ వెలిసిన పోస్టర్లు

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర

భెల్‌కాలనీ, జూన్ 29(ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ ఎంఐజీకాలనీలో జగన్నాథ రథయాత్రను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామాలయం నుంచి కాలనీ వీధుల్లో జరిగిన రథయాత్ర ఉత్సాహంగా సాగింది. ఈ యాత్రకు కాలనీవాసులు అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఆదివారం సాయంత్రం దేవాలయం నుంచి ప్రారంభమైన రథయాత్రను డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి నాయకులు భాస్కర్, సంపత్, చిన్నా, రాకేష్, కుమార్ తదితరులతో పాటు రామాలయ కమిటీ సభ్యులు పాల్గొని యాత్రను ప్రారంభించారు. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన రథంపై బలభద్రుడి విగ్రహాలను సుందరంగా అలంకరించి యాత్రను చేపట్టగా విశేష వస్త్రాలంకరణతో చిన్నారులు రథం ఎదుట ఆడిపాడుతూ నృత్యాలు చేశారు. ప్రధాన రహదారుల వెంట జరిగిన రథయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొని జగన్నాథుడిని స్మరించుకున్నారు.


రథయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి తదితరులు

మొబైల్‌కు దూరంగా ఉంటే లక్ష్యాలను చేరుకోవచ్చు

హైదర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అవసరానికి తగ్గట్లు మొబైల్ వాడాలని, మొబైల్స్ వాడకం తగ్గిస్తే విద్యార్థులు తమ లక్ష్యాలను సాధిస్తారని ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోప) రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శంకర్ సూచించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ 2024-25గాను మేడ్చల్ జిల్లాకు చెందిన ఆర్యవైశ్య విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 150మంది విద్యార్థులకు మేడ్చల్ జిల్లా ఆవోపా కమిటీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఆదివారం కూకట్‌పల్లి పీఎంఎం పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల నాగరాజు, ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, కోశాధికారి సతీష్ చేతుల మీదుగా విద్యార్థులకు పురస్కారాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులను గౌరవించడం విద్యార్థులు నేర్చుకోవాల్సిన ముఖ్యమైన విషయమన్నారు. నిత్యం విద్యార్థులు ఉదయం 5గంటలకు బ్రహ్మ ముహూర్తంలో లేవడం అలవాటు చేసుకోవాలన్నారు. విద్యార్థుల అలవాట్లను తల్లిదండ్రులు గమనించలన్నారు. తప్పుదారిలో వెళ్తున్నారని అనుమానం వస్తే సన్మార్గంలో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆవోప రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వందనపు శిల్ప, ఆర్యవైశ్య సంఘం జిల్లా సభ్యులు రవి కుమార్, ప్రకాష్‌గుప్త, ప్రవీణ్‌కుమార్‌గుప్త, రమేష్‌కుమార్‌గుప్త, రఘువంశీ, నవీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆవోప రాష్ట్ర అధ్యక్షుడు శంకర్

క్యాత్ ల్యాబ్‌లో రేడియేషన్‌పై అవగాహన సదస్సు

నిమ్స్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): క్యాత్ ల్యాబ్‌లో రేడియేషన్ ఎక్కువగా ఉంటుందని, దాని వల్ల వైద్యులకే ఎక్కువ సమస్యలు వస్తాయని కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ సోమరాజు అన్నారు. దానిని అధిగమించడానికి తగిన పరికరాలు వాడాలని వైద్యులకు సూచించారు. గుండె శస్త్రచికిత్సకు ముందు యాంజియోగ్రఫీ చేసే సమయంలో వైద్యులు క్యాత్‌ల్యాబ్(ఆపరేషన్) థియేటర్లో ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను ఎలా అధిగమించాలనే అంశంపై కార్డియాలజీ విభాగ నిపుణులు వైద్యులకు, వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిమ్స్ ఆస్పత్రి ఐదో అంతస్తు ట్రామా ఆడిటోరియంలో 'ఇంటర్వెన్షనల్ కాంప్లికేషన్స్' మేనేజ్మెంట్ ఆఫ్ క్యాత్ లాబ్ కాంప్లికేషన్స్' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ బి.సోమరాజు, డాక్టర్ దయాసాగర్రావు, డాక్టర్ శేషగిరిరావు మాట్లాడారు. వైద్యులు ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కరోనరి యాంజియోగ్రఫీ, పీటీసీఏ (గుండెకు) స్టెంట్‌ను సరైన పద్ధతిలో ఎలా అమర్చాలి అనే అంశాలపై చర్చించారు. డాక్టర్ రమాకుమారి ఆధ్వర్యంలో జరిగిన కంటున్యూ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎమ్ఈ) ప్రోగ్రాంలో డాక్టర్ శ్రీనివాస్‌కుమార్, డాక్టర్ అనుజ్ కపాడియా, డాక్టర్ శశికాంత్, డాక్టర్ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప


తనికెళ్ల భరణి, బ్నిం లను సత్కరిస్తున్న అతిథులు

తనికెళ్ల భరణి, బ్నింకు 'బాపు రమణ' స్నేహ పురస్కారం

రవీంద్రభారతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బాపు, రమణల స్నేహం ఈతరానికి ఆదర్శప్రాయమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో బాపు రమణ లోగిలి సంస్థ ఆధ్వర్యంలో ముళ్లపూడి వెంకటరమణ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు తనికెళ్ళభరణి, రచయిత బ్నింలకు బాపురమణల స్నేహ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మామిడి హరికృష్ణ పురస్కారాల గ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నేహానికి మారుపేరుగా నిలిచే బాపు, రమణల పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనికెళ్ల భరణి చిరస్థాయి పేరు సంపాదించుకున్నారని అన్నారు. తన రచనలతో బ్నిం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందన్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిత్ మోహన్, వింజమూరి వెంకట అప్పారావు, భావరాజు పద్మిని, వేగిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొని పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను ఆవిష్కరించారు.

తెలంగాణ నాయర్ సొసైటీ ఏర్పాటు అభినందనీయం

- గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై

కాప్రా, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా, నిస్వార్థ సేవే లక్ష్యంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని గోవా గవర్నర్ పీఎస్. శ్రీధరన్ పిళ్లై అన్నారు. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఆదివారం కాప్రాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని నాయర్లు సేవా సొసైటీని ఏర్పాటు చేసుకుని ఏకతాటిపైకి రావడం శుభ పరిణామమన్నారు. కేరళ నాయర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మన్నత్ పద్మనాభన్ ఆశయాలకనుగుణంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీ పనిచేయాలని, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా తెలంగాణలోని అన్ని వర్గాల వారికి సేవలందించాలని ఆయన సూచించారు. అనంతరం వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయర్ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ నాయర్ సేవా సొసైటీ అధ్యక్షుడు కె.సురేంద్రన్, ఉపాధ్యక్షుడు పి.మోహన్, ప్రధాన కార్యదర్శి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.


సొసైటీని వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడుతున్న శ్రీధరన్ పిళ్లై


ఎమ్మెల్యే గాంధీతో సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

ఎమ్మెల్యేను కలిసిన వడియరాజులు సొసైటీ సంఘం సభ్యులు

హైదర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ మార్తాండ్‌నగర్ కాలనీకి చెందిన వడియరాజులు సొసైటీ సంఘంకు నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గ సభ్యులు ఆదివారం పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని వివేకానందనగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సంఘం అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కాలనీ, సంఘం అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, వడియరాజులు సొసైటీ సంఘం అధ్యక్షుడు దుర్గారావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సెక్రటరీ కొండల్‌రావు, జాయింట్ సెక్రటరీ మధు, ట్రెజరర్ శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బాలాజీ, వెంకటేశ్వరరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీఓ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీఎన్‌జీఓ కాలనీ, రంగారెడ్డి, కేంబ్రిడ్జి పాఠశాల, అలయ్‌బలయ్ చౌరస్తాలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెక్రటేరియట్ కాలనీ, అలయ్‌బలయ్ చౌరస్తా, టీఎన్‌జీవో కాలనీ, కాళోజీ చౌరస్తాలో విద్యుత్ ఉండదన్నారు.

గచ్చిబౌలి పైవంతెనకు పీజేఆర్ పేరు పెట్టడంపై కార్పొరేటర్ హర్షం

గచ్చిబౌలి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి పైవంతెనకు స్వర్గీయ నేత పీజేఆర్ పేరు పెట్టినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పీజేఆర్ శేరిలింగంపల్లిలో చేసిన అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మరువలేరని, ఆయనకు నియోజకవర్గం రుణపడి ఉంటుందన్నారు. అలాంటి నేతకు దక్కాల్సిన గౌరవం ముఖ్యమంత్రి ఇచ్చారన్నారు. పీజేఆర్ నిరంతరం ప్రజలకోసం, వారి సంక్షేమం కోసం పరితపించిన మహానేత అని కొనియాడారు.


శిక్షణ శిబిరంలో పాల్గొన్న ప్రతినిధులు

కుటుంబ సమస్యలు చర్చలతో పరిష్కరించుకోవాలి

రాయదుర్గం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కుటుంబ వివాదాల పరిష్కారంలో దేశానికి మార్గదర్శంగా నిలిచే ప్రథమ కుటుంబ మధ్యస్థత శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. ఏడు రోజుల పాటు జరిగిన 60 గంటల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గచ్చిబౌలిలోని ఐఎంసీ కేంద్రంలో నిర్వహించారు. సీఎస్ఆర్ విధానంలో సర్టిఫికెట్ సంస్థ ఈ కార్యక్రమానికి స్పాన్సర్ చేసింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా సెషన్ న్యాయమూర్తి, సభ్య కార్యదర్శి తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ హాజరయ్యారు. ప్రస్తుతం భార్యాభర్తలు చిన్నపాటి విషయాలకే గొడవ పడుతున్నారని, అలాంటి విషయాలను చర్చల ద్వారా పరిష్కరించగలిగితే కోర్టుల్లో కేసుల భారాన్ని తగ్గించవచ్చన్నారు. దేశవ్యాప్తంగా కొత్త మధ్యవర్తుల బృందం సిద్ధం చేయడం జరిగిందని ఈ శిక్షణలో దేశవ్యాప్తంగా అజ్మీర్, బెంగళూరు, భువనేశ్వర్, చెన్నై, ఢిల్లీ, హజారీబాగ్, హైదరాబాద్, కోల్‌కత్తా, ముంబై, నల్గొండ, పూణే, వరంగల్ లాంటి ప్రాంతాల నుంచి వచ్చిన 32 మంది పాల్గొన్నారు. వీరిలో సామాజిక కార్యకర్తలు, కౌన్సెలింగ్ సైకాలజిస్టులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కూకట్‌పల్లి కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి

కూకట్‌పల్లి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కూకట్‌పల్లి పార్ట్-1 కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ డివిజన్ అధ్యక్షుడు బాలుయాదవ్ ఆదివారం ఆయనకు నియామకపత్రం అందజేశారు. అనంతరం బాలుయాదవ్ మాట్లాడుతూ, బీజేపీ బలోపేతానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మహిళలు, యువత, స్వయంశక్తితో ఎదిగేలా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అస్‌బెస్టాస్‌కాలనీ అధ్యక్షుడు నరేశ్, బీజేపీ నాయకులు రాజిరెడ్డి, భూపాల్‌రెడ్డి, పవన్‌యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న డివిజన్ అధ్యక్షుడు బాలుయాదవ్

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి: డీసీ

కుత్బుల్లాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ (డీసీ) మల్లారెడ్డి కోరారు. ప్రజల నుంచి సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆయన అన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని, సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



కనుల పండువగా రథయాత్ర

నిజాంపేట కార్పొరేషన్ బాచుపల్లిలో ఆదివారం జగన్నాథ రథయాత్రను కనుల పండువగా నిర్వహించారు. కాలనీవాసులు, నిజాంపేట కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

నిజాంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి)



బోనాల్లో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ తదితరులు

వైభవంగా మిద్దెమైసమ్మ బోనాలు

దుండిగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ, దుండిగల్ గ్రామంలోని కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో మిద్దెమైసమ్మ బోనాల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో మల్లంపేట మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు శంభీపూర్ కృష్ణ పాల్గొన్నారు. మిద్దెమైసమ్మ బోనాల పూజల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. మాజీ కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్, గోపాల్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ కృష్ణ, నాయకులు కె.మల్లేష్, హన్మంత్‌రెడ్డి, ముత్యంరెడ్డి, చిట్ల కృష్ణ, మధుసూదన్, మధు, వీరేష్, రాజు, రమేష్, కుమ్మరి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'న్యూస్ చానల్'పై దాడి హేయం

● ఎన్ఎస్‌యూఐ నేత గొల్ల జాన్



షాపూర్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): న్యూస్ చానల్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ అన్నారు. సూరారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంకా బీఆర్ఎస్ ప్రభుత్వం ఉందనే భ్రమలో ఉన్న ఆ పార్టీ నాయకులు ఉన్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో పిల్లర్ అని, అలాంటి మీడియా సంస్థలపై దాడులు సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఒక చరిత్ర ఉందని, అనవసరంగా తమ పార్టీ నాయకులు, ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలకు పని చెప్పొద్దని కేటీఆర్, హరీశ్‌రావులను మరోసారి హెచ్చరిస్తున్నామని గొల్ల జాన్ అన్నారు. మేము తలచుకుంటే టీన్యూస్‌చానల్, నమస్తే తెలంగాణ పేపర్ నడుస్తాయా అని ప్రశ్నించారు.



అధికారులు ఇచ్చిన నోటీస్‌ను చూపుతున్న గ్రామస్థులు

నష్టపరిహారం చెల్లించాకే రోడ్డు విస్తరణ చేపట్టాలి

● దూలపల్లి గ్రామస్థుల డిమాండ్

పేట్‌బషీరాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఇళ్ల యజమానులకు, ఫుట్‌పాత్ వ్యాపారులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని దూలపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని జాతీయ రహదారి 44 నుంచి బహదూర్‌పల్లి వరకు రోడ్డును 100 అడుగులకు విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, దుకాణదారులకు మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేశారు. ఈ నేపథ్యంలో దూలపల్లి వ్యవసాయ సహకార బ్యాంక్ డైరెక్టర్ సత్యనారాయణ, డప్పు నరేందర్, వెంకటేశం, పెంటయ్య, మంత్రి రఘు, లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో గ్రామస్థులు సమావేశమై ఎలాంటి కార్యాచరణ చేపట్టాలనే దానిపై చర్చించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, దుకాణాలకు మున్సిపల్ అధికారులు నోటీసులు అందజేశారని, వారం రోజుల్లో ఇల్లు తొలగించుకోవాలని నోటీస్‌లో పేర్కొన్నారని, ఇంత స్వల్ప వ్యవధిలో తాము ఎక్కడిపోగలమని వారు ప్రశ్నించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తామని గ్రామస్థులు తెలిపారు. ఇళ్ల యజమానులకు, ఫుట్‌పాత్ వ్యాపారులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని దూలపల్లి వ్యవసాయ సహకార బ్యాంక్ డైరెక్టర్ సత్యనారాయణ తదితరులు డిమాండ్ చేశారు.



3కే రన్‌లో పాల్గొన్న ఆస్పత్రి సిబ్బంది తదితరులు

బాచుపల్లిలో 3కే రన్

నిజాంపేట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని రిచ్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 3కె రన్ నిర్వహించారు. ఎన్ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరై ఈ రన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ధనరాజ్‌యాదవ్ మాట్లాడుతూ, మన ఆరోగ్యం మన చేతుల్లోనే అని ప్రజలకు అవగాహన కల్పిస్తూ, వందలాది మందిని ఒక చోటకు చేర్చి 3కె రన్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. రన్‌లో పాల్గొన్న వారికి ఆస్పత్రి ఎండీ రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ చంద్రకిరణ్, సృజనా రెడ్డి, అక్షయ్, నవనీత, తిరుపతి, ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

నీటి లీకేజ్.. రోడ్లు డ్యామేజ్

- పైప్‌లైన్లు, వాల్వ్‌ల నుంచి రోడ్లపై పారుతున్న తాగునీరు
- అరికట్టడంలో జలమండలి నిర్లక్ష్యం
- గుంతలుపడి శిథిలమవుతున్న రహదారులు
- రాకపోకలకు జనం అవస్థలు





బాపూనగర్‌లో లీకైన నీటితో శిథిలమైన రోడ్డు



రేణుక ఎల్లమ్మ ఆలయ సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు

సుదర్శన్‌రెడ్డినగర్‌లో వాల్వ్ నుంచి లీకవుతున్న తాగునీరు

కుత్బుల్లాపూర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జలమండలి, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారుతోంది. తాగునీటి పైప్‌లైన్లు, వాల్వ్‌ల వద్ద లీకేజీలను అరికట్టడంలో జలమండలి నిర్లక్ష్యం చేస్తుండటంతో ఆ నీరు రోడ్లపైకి చేరి రోడ్లు ధ్వంసమవుతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు రోడ్లకు సత్వరం ప్యాచ్ వర్క్‌లు చేపట్టకపోవడం, చేపట్టినా ఒక్కోసారి మళ్లీ తాగునీరు లీకేజీలవుతుండటంతో రోడ్లు మరింత దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని బాపూనగర్, సుదర్శన్‌రెడ్డినగర్, వాణినగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్లు లీకేజీలవుతున్నాయి. బాపూనగర్‌లోని రోడ్ నెంబర్ 2 ప్రారంభంలో ఉన్న తాగునీటి సరఫరా వాల్వ్ లీకవుతూ రోడ్డుపై పారుతోంది. దీంతో రోడ్డు శిథిలమై గుంతలుగా మారుతోంది. తాగునీటి లీకేజీల వల్ల గుంతలు పడ్డ రోడ్డుకు బీటీతో ప్యాచ్ వర్క్ వేయించారని, మళ్లీ వాల్వ్ నుంచి నీరు లీకేజీ అయి రోడ్డుపై పారడంతో గుంతల సమస్య పునరావృతమైందని స్థానికులు తెలిపారు.

● సుదర్శన్‌రెడ్డినగర్‌లోని ఎల్లమ్మగుడి నుంచి చింతల్ వెళ్లే రోడ్డులో కొన్నేళ్లుగా వాల్వ్ నుంచి నీరు లీకేజీ అవుతూ ఎల్లమ్మ గుడి మీదుగా మల్లికార్జుననగర్ వరకు పారుతోంది. వాణినగర్‌లోని డస్ట్‌బిన్‌లున్న ప్రాంతంలోనూ ఇదే సమస్య. లీకేజీల నీటి వల్ల ప్రజాధనంతో వేసిన రోడ్లు మూణ్నాళ్లకే శిథిలమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మున్సిపల్ అధికారులు, జలమండలి అధికారుల సమన్వయ లోపమే ఈ సమస్యకు కారణమని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత విభాగం ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి లీకేజీలను అరికట్టి రోడ్లు ధ్వంసం కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి: ఎమ్మెల్యే



.పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్‌లోని బృందావన్‌కాలనీలో రూ. 91 లక్షలతో అభివృద్ధి చేసిన పార్కును ఆయన కార్పొరేటర్ తారాచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత పదేళ్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశామని, ఎన్నో పార్కులను అందంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దామని అన్నారు. బృందావన్ కాలనీలో మిషన్‌భగీరథ ద్వారా నీటి సదుపాయం కల్పించామని, వీధి దీపాలు ఏర్పాటు చేశామని, పార్కు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. చుట్టుపక్కల అపార్టుమెంట్స్, కాలనీవాసులకు పార్కు ఆహ్లాదాన్ని పంచుతుందన్నారు. కార్యక్రమంలో బృందావన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి రమణకుమార్‌రాజు, కోశాధికారి జోగారావ్, సంఘం సభ్యులు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



కాలనీలోని సమస్యలపై హన్మంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సంక్షేమ సంఘం సభ్యులు

మౌలిక సదుపాయాలు కల్పిస్తా

● కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : మల్లికార్జున నగర్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి కాలనీవాసులకు హామీ ఇచ్చారు. తమ కాలనీలో మౌలిక వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నామని దుండిగల్ మున్సిపాలిటీ డి పోచంపల్లి పరిధిలోని మల్లికార్జున నగర్ కాలనీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి కాలనీవాసులతో పాటు హన్మంత్‌రెడ్డిని ఆదివారం కలిసి తెలిపారు. దీంతో ఆయన జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మల్లికార్జున నగర్‌లో పర్యటించి సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా డ్రైనేజీ, సీసీ రోడ్లు మంజూరు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. మాజీ కౌన్సిలర్ రామ్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, జక్కుల మల్లేష్‌యాదవ్, ముత్యంరెడ్డి, సంజీవరెడ్డి, శివకుమార్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఉన్నారు.



లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ఎల్ఓసీలను అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా: కూన

షాపూర్‌నగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంలా మారిందని, వారు మెరుగైన వైద్యం పొందేందుకు భరోసా కల్పిస్తోందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన నలుగురికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి జారీ అయిన ఆర్థిక సాయం మంజూరు పత్రాలు (ఎల్ఓసీ)లను లబ్ధిదారులకు ఆయన ఆదివారం గాజులరామారంలోని చిత్తారమ్మ ఆలయ ఆవరణలో పంపిణీ చేశారు. కొండడి యాదవరావుకు రూ.60 వేలు, కడలి సత్యనారాయణకు రూ. 37,500లు, బి. విజయ రామరాజుకు రూ. 32,500లు, బి.విఠల్‌కు రూ.60 వేలు విలువైన ఎల్ఓసీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్యాత్ ల్యాబ్‌లో రేడియేషన్‌పై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

నిమ్స్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): క్యాత్ ల్యాబ్‌లో రేడియేషన్ ఎక్కువగా ఉంటుందని, దాని వల్ల వైద్యులకే ఎక్కువ సమస్యలు వస్తాయని కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ సోమరాజు అన్నారు. దానిని అధిగమించడానికి తగిన పరికరాలు వాడాలని వైద్యులకు సూచించారు. గుండె శస్త్రచికిత్సకు ముందు యాంజియోగ్రఫీ చేసే సమయంలో వైద్యులు క్యాత్‌లాబ్(ఆపరేషన్) థియేటర్లో ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను ఎలా అధిగమించాలనే అంశంపై కార్డియాలజీ విభాగ నిపుణులు వైద్యులకు, వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిమ్స్ ఆస్పత్రి ఐదో అంతస్తు ట్రామా ఆడిటోరియంలో 'ఇంటర్వెన్షనల్ కాంప్లికేషన్స్' మేనేజ్మెంట్ ఆఫ్ క్యాత్ లాబ్ కాంప్లికేషన్స్' అనే అంశంపై ఆదివారం సదస్సు నిర్వహించారు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ప్రముఖ కార్డియాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ బి.సోమరాజు, డాక్టర్ దయాసాగర్‌రావు, డాక్టర్ శేషగిరిరావు మాట్లాడారు. వైద్యులు ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కరొనరి యాంజియోగ్రఫీ, పీటీసీఏ (గుండెకు) స్టెంట్‌ను సరైన పద్ధతిలో ఎలా అమర్చాలి అనే అంశాలపై చర్చించారు. డాక్టర్ రమాకుమారి ఆధ్వర్యంలో జరిగిన కంటున్యూ మెడికల్ ఎడ్యుకేషన్(సీఎమ్ఈ) ప్రోగ్రాంలో డాక్టర్ శ్రీనివాస్‌కుమార్, డాక్టర్ అనుజ్ కపాడియా, డాక్టర్ శశికాంత్, డాక్టర్ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.




తనికెళ్ల భరణి, బ్నిం లను సత్కరిస్తున్న అతిథులు

తనికెళ్ల భరణి, బ్నింకు 'బాపు రమణ' స్నేహ పురస్కారం

రవీంద్రభారతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బాపు, రమణల స్నేహం ఈతరానికి ఆదర్శప్రాయమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో బాపు రమణ లోగిలి సంస్థ ఆధ్వర్యంలో ముళ్లపూడి వెంకటరమణ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు తనికెళ్లభరణి, రచయిత బ్నింలకు బాపురమణల స్నేహ పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మామిడి హరికృష్ణ పురస్కారాల గ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్నేహానికి మారుపేరుగా నిలిచే బాపు, రమణల పేరిట పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమని అన్నారు. తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనికెళ్ల భరణి చిరస్థాయి పేరు సంపాదించుకున్నారని అ న్నారు. తన రచనలతో బ్నిం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోందన్నారని కొనియాడారు. కార్యక్రమంలో జిత్‌మోహన్, వింజమూరి వెంకట అప్పారావు, భావరాజు పద్మిని, వేగిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొని పురస్కారగ్రహీతల్ని సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను ఆవిష్కరించారు.

తెలంగాణ నాయర్ సొసైటీ ఏర్పాటు అభినందనీయం

● గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై



కాప్రా, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా, నిస్వార్థ సేవే లక్ష్యంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని గోవా గవర్నర్ పీఎస్. శ్రీధరన్ పిళ్లై అన్నారు. నూతనం గా ఏర్పాటైన తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఆదివారం కాప్రాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని నాయర్లు సేవా సొసైటీని ఏర్పాటు చేసుకుని ఏకతాటిపైకి రావడం శుభ పరిణామమన్నారు. కేరళ నాయర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మన్నత్ పద్మనాభన్ ఆశయాలకనుగుణంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీ పనిచేయాలని, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా తెలంగాణలోని అన్ని వర్గాల వారికి సేవలందించాలని ఆయన సూచించారు. అనంతరం వివిధ రంగాలలో ఉ త్తమ ప్రతిభ కనబరిచిన నాయర్ విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ నాయర్ సేవా సొసైటీ అధ్యక్షుడు కె.సురేంద్రన్, ఉపాధ్యక్షుడు పి.మోహన్, ప్రధాన కార్యదర్శి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులను పరిరక్షించాలి

నిజాంపేట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, జీవో నెంబరు 2016 ప్రకారం దివ్యాంగుల హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని న్యూశక్తి దివ్యాంగుల సంస్థ మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వేల్పుకొండ వెంకటస్వామి, తన్నీరు చిరంజీవులు అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిజాంపేటలోని డబుల్‌బెడ్ రూమ్స్ 10వ బ్లాక్‌లో జరిగిన దివ్యాంగుల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దివ్యాంగులకు చక్రాల కుర్చీలు, సంక కర్రలు, ఇతర పరికరాలను పంపిణీ చేశారు. మేడ్చల్ జిల్లాలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి తమ సంస్థ ద్వారా కృషి చేస్తున్నామని, ఇక్కడ ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నర్సింహ, రాజయ్య, కమిటీ సభ్యులు కృష్ణ, శంక ర్, డేవిడ్, టైలర్ స్వామి, వేణు, శ్రీకాంత్, రాజు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గాజులరామారం, జూన్ 29 (ఆంధ్ర జ్యోతి) : గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని 11 కేవీ మహాదేవపురం, గాజుల రామారం, ఉషోదయ ఫీడర్ల పరిధిలో జీహెచ్ఎంసీ రోడ్డు పనుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామని ఏఈ చైతన్య భార్గవ్ తెలిపారు. వీఎస్ఆర్ అపార్టుమెంట్, గాజులరామారం మహారాజా గార్డెన్ లేన్, వల్లభ్ రెసిడెన్సీ, గాజులరామారం గ్రామం, వెంకటేశ్వర గార్డెన్ లేన్‌లో విద్యుత్ ఉండదని ఏఈ పేర్కొన్నారు.



మొక్క నాటి నీరుపోస్తున్న కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

పేట్‌బషీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్‌లోని వెంకటేశ్వరకాలనీ వెస్ట్ హనుమాన్ ఆలయం సమీపంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా పర్యావరణ అభియాన్, అమ్మ పేరుతో కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు మొక్కలు నాటుకొని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, కాలనీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సతీష్, చక్రవర్తి, జీడిమెట్ల డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి. రాజు, ప్రభాకర్‌రెడ్డి, నారాయణ, శ్రీశైలం, మహేష్, మారుతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు

గచ్చిబౌలి ఫ్లైఓవర్‌కు పీజేఆర్ పేరు హర్షణీయం

జీడిమెట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పేదల పక్షపాతి, కార్మికనేత, సీఎల్పీ మాజీ నేత, మాజీ మంత్రి పి.జనార్ధన్‌రెడ్డి (పీజేఆర్)అని యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయికుమార్ పటేల్ అన్నారు. జగద్గిరిగుట్ట చౌరస్తాలోని పీజేఆర్ విగ్రహానికి ఆయన స్థానికులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ, గచ్చిబౌలి ఫ్లైఓవర్‌కు పీజేఆర్ పేరు పెట్టడం హర్షణీయమన్నారు. ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో హైదరాబాద్ ప్రజలకు, ముఖ్యంగా హైటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనకరమన్నారు. కార్యక్రమంలో పీజేఆర్ అభిమానులు లింగయ్య, యాదగిరి, పరశురామ్,ఎన్ఎస్‌యూఐ నాయకులు శ్యామ్, అశోక్, శ్రావన్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాఫిక్ సిగ్నల్ పోల్



సుచిత్ర చౌరస్తాలో పక్కకు ఒరిగిన సిగ్నల్ పోల్

పేట్‌బషీరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సుచిత్రాలోని ట్రాఫిక్ సిగ్నల్ పోల్ పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. సుచిత్రా చౌరస్తానుంచి కుత్బుల్లాపూర్‌కు వచ్చే ప్రధాన రహదారి పక్కనే ఉన్న ట్రాఫిక్ సిగ్నల్‌పోల్ గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో పక్కకు ఒరిగింది. దీంతో ఆ రహదారి నుంచి భారీవాహనం వెళ్తే సిగ్నల్‌ను తాకేవిధంగా ప్రమాదకరంగా ఉంది. తక్షణమే అధికారులు స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకముందే సిగ్నల్ పోల్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మారిన విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు

గాజులరామారం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ డీఈ మేడ్చల్, ఏడీఈ కుత్బుల్లాపూర్‌లో పని చేస్తున్న విద్యుత్ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు వినియోగదారులు ఈ నెంబర్లకు ఫోన్ చేసి, సమస్యను అధికారులకు వివరిస్తే వెంటనే పరిష్కరించేందుకు 24 గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని గాజుల రామారం విద్యుత్ ఏఈ చైతన్య భార్గవ్ తెలిపారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్	1921
ఫ్యూజ్ కాల్ ఆఫీస్, గాజులరామారం	8712472592
రమేష్, లైన్ ఇన్‌స్పెక్టర్ గాజులరామారం	8712472607
శంకర్‌గౌడ్, లైన్ మ్యాన్ గాజులరామారం	8712472617
కిరణ్‌కుమార్, లైన్‌మ్యాన్ మహాదేవపురం	8712472618
వేణు గోపాల్, లైన్ ఇన్‌స్పెక్టర్ మహాదేవపురం	8712472608
చైతన్య భార్గవ్, ఏఈ గాజులరామారం	8712472564
శ్రీకాంత్, ఏడీఈ కుత్బుల్లాపూర్	8712472561
జాన్‌రాజు, డీఈ మేడ్చల్	8712472560